
# ప్రభాత ప్రార్థన



ఆదిలాబాద్ గురుపీఠం

మొదటి ప్రచురణ : క్రీస్తు జయంతి 2001
రెండవ ప్రచురణ : సెప్టెంబర్ 2021
ప్రతులు : 1000

మొదటి ప్రచురణ : ఫాదర్ జేమ్స్ తూండియిల్ CMI
మొదటి ప్రచురణ కూర్పు : ఫాదర్ ఇన్నయ్య పోలిశెట్టి OFM.Cap

ముద్రణానుమతి

మహా ఘన ప్రిన్స్ అంతోని తండ్రి గారు

ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

***

ఆదిలాబాద్ గురుపీఠ విశ్వాసుల ఉపయోగార్థమై

ఈ ప్రార్థన పుస్తకము ముద్రించబడినది

**ప్రతులకు సంప్రదించండి**

జీవస్వరం
బిషప్స్ హౌస్
మంచిర్యాల– 504 208
జిల్లా: మంచిర్యాల, తెలంగాణ
ఫోన్ : 9398764408

Jeevaswaram
Bishop's House
Mancherial - 504 208
Dist. Mancherial, T.S.
Cell : 9398764408

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ప్రభాత ప్రార్థన | .... | 1 |
| 2. | ఆగమన కాలము | .... | 7 |
| 3. | క్రీస్తు జయంతి | .... | 15 |
| 4. | క్రీస్తు సాక్షాత్కార కాలము | .... | 19 |
| 5. | తపస్సు కాలము | .... | 27 |
| 6. | పునరుత్థాన కాలము | .... | 35 |
| 7. | అపోస్తులుల కాలము&సభావికాస కాలము | .... | 43 |
| 8. | ఏలియా స్లీవా మోషె కాలములు | .... | 51 |
| 9. | సభా సమర్పణ కాలము | .... | 59 |

# ప్రభాత ప్రార్థన

## ఉదయ గీతం

ఉదయమే సన్నిధి చేరితిమి
పావనమగు మీ నామమున
ప్రభువా మీ కనికరమునకై
వందన స్తుతులను అర్పింప

మానవ సృష్టి పాలకా
వినయ పూర్వక వందనముల్
మీ కృపశాంతి అనుగ్రహముల్
పాప విమోచన మొసగుమయా

ప్రతి నిమిషం నా నేత్రములు
కార్చును అనుతాపాశ్రువులు
అయినను పెరుగును పాపములు
కరుణా సాగర కరుణించు

నూతన దినమున పాపులము
ప్రయాణం నారంభించెదము
శోధనలన్నింటిని తొలగించి
వెలుగులో మమ్ము నడిపించు

ప్రభువా మీ సువిశేషముల
ఇరుకైన మార్గములో
పరిశుద్ధుల సుమాతృకలో
స్థిరముగా మమ్ము నడపండి

తండ్రి దేవా మీ ప్రేమయును
సుతుని కృపయు అనుగ్రహము
పరిశుద్ధాత్మా సహవాసం
నిరతము మాలో నింపుమయా

| | |
|---|---|
| గురువు (నాయకుడు) : | సృష్టికర్తవైన సర్వేశ్వరా ఈ ఉదయకాలములో మేము మిమ్ము ఆరాధించుచున్నాము. పాపుల మైన మమ్ము అంధకారం నుండి ప్రకాశము లోనికి నడిపించిన దేవా, మేము మీకు వందనములు చెప్పుచున్నాము. నేటి మా తలంపులు వాక్కులు క్రియలు మీకు సమర్పించు చున్నాము. విశ్వాసముతో మీకు సేవలు చేయుటలో మాకు తోడ్పడండి. నేటి మా ప్రయత్నములన్నిటిని ఫలవంతము చేయండి. మమ్ము మీ వెలుగులో నడిపించండి. క్రీస్తు నందు సమస్తము నూతనము చేయుటకు, మిమ్ము మహిమ పరచుటకు మమ్ము శక్తివంతులను చేయండి. పితా పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా. |
| అందరు : | ఆమెన్ |

## కీర్తన 100:1-5

సర్వ ప్రపంచమా,
సర్వేశ్వరుని జేకొట్టుము
సంతోషముతో ప్రభువును పూజింపుము
ఆనంద గీతములతో ఆయన సన్నిధికి రండి

ప్రభువే దేవుడని తెలుసుకొనుడు
ఆయన మనలను సృజించెను

మనము ఆయన వారలము
ఆయన మేపు మందలము

కృతజ్ఞతా స్తుతులతో ఆయన మందిరద్వారమున ప్రవేశింపుడు
స్తుతి గీతములతో ఆయన దేవాలయ ఆవరణలోనికి రండు

ప్రభువు మంచివాడు
అతని ప్రేమ శాశ్వతమైనది
ఆయన విశ్వసనీయత కలకాలముండును

పితా, పుత్ర, పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్.

గురువు (నాయకుడు) : మా జీవపు ఊటయిన దేవా, స్వర్గమును లక్ష్యము చేసుకొని నూతన దినం ప్రారంభించుటకు మా సత్క్రియలను చూచి ప్రజలు మిమ్ము స్తుతించునట్లు పరిశుద్ధులుగా జీవించుటకు మాకు తోడ్పడండి. పితా, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా

అందరు : ఆమెన్

## కీర్తన 23:1-4,5

ప్రభువే నా కాపరి
నాకు ఏ కొదవయు లేదు

ఆయన నన్ను పచ్చిక బయళ్ళలో విశ్రమింపచేయును
శాంతికరమైన జలముల యొద్దకు నడిపించుకొని పోవును

నా బడలికను తొలగించి
తాను వాగ్దానము చేసినట్లే
నన్ను ధర్మ మార్గమున నడిపించును

గాఢాంధకారపు లోయలలో నేను నడిచినను
ఏ అపాయమునకును భయపడను

ప్రభువు నాకు తోడుగా యుందువు
నీ బడితయు నీ కోలయు నన్ను కాపాడుచుండును

నా జీవితములో ప్రతి దినము
నీ కరుణయు ఉపకారమును నా వెంట వచ్చును
నేను కలకాలము ప్రభువు మందిరమున నివసింతును

పితా, పుత్ర, పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్.

గురువు (నాయకుడు) : నిత్య ప్రకాశమైన సర్వేశ్వరా, మీ పరిపాలన ఎంతో మహనీయము, సత్యమార్గమందు మమ్ము నడిపించండి. దు:ఖములో మమ్ము ఓదార్చండి. మా సంతోషములను పవిత్రం చేయండి. నిస్వార్థమైన సేవా భావము మాలో కలిగించండి. పితా, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా

అందరు : ఆమెన్

## కీర్తన (ఆయా రోజులను అనుసరించి)

గురువు (నాయకుడు) : పరస్పర ప్రేమ కలిగియున్నచో మీరు నా శిష్యులు అని చెప్పిన ప్రభువా ! మీ ప్రేమ మార్గములో మమ్ము నడపండి. శోకార్తులను ఓదార్చుటకు, విశ్వాసములో బలహీనులను బలపరచుటకు, నిరాశలో పడిన వారికి ఆశాభావమును కలిగించుటకు మమ్ము శక్తివంతులను చేయండి. సకలమునకు ప్రభువైన సర్వేశ్వరా.

అందరు : ఆమెన్

## కీర్తన (ఆదివారము, పండుగ దినములలో)

సర్వచరాచరసృష్టికర్తను
స్తుతించి కీర్తన పాడుడి సతతం

కొండలు కోనలు తిప్పల్లారా
పాటలు పాడే పక్షుల్లారా ॥సర్వ॥

గిరుల్లు ఝరిల్లు తరువుల్లారా
నీటిలో నివసించు జంతువులారా ॥సర్వ॥

యాజకులు ప్రభు సేవకులారా
మానవ వానవ బృందములారా ॥సర్వ॥

వాయువు శీతము ఉష్ణములారా
అంబరము జల బిందువులారా ॥సర్వ॥

సూర్యుడు చంద్రుడు తారకలారా
సరస్సులు నదులు మేఘములారా ॥సర్వ॥

ఇహము పరము చీకటి వెలుగు
సర్వచరాచర బృందములారా ॥సర్వ॥

స్తుతియారాధన కీర్తన గీతముల్
నిత్య పితా సుత పరిశుద్ధాత్మ

**(సాధారణ దినములలో)**

సృష్టికర్తా వందనం నీకు
ఉదయారాధన అర్పించెదము
నరులకు శాశ్వత రక్షణమొసగ
నరుడై పుట్టిన యేసు మహేశ

పశ్చాత్తాపం కలిగిన వార్కి
అభయం ఇలలో మీరే ప్రభువా
సన్నిధి చేరి వేడెదం మేము
పుత్రుల ప్రార్థనలాలించు దేవా

లెక్కకు మించిన పాపములన్ని
కడుగుడి దేవా మీ రక్తముతో
నర పరిపాలక మీకెల్లప్పుడు
స్తుతియారాధన కలుగునుగాక

గురువు : నూతన ప్రకాశమును, మానవాళికి ఆశాజ్యోతివైన క్రీస్తువా, మీ దివ్య దర్శనముచే మమ్ము ధన్యులను చేయండి. మమ్ము, మా సహచరులను మీ దివ్య కాంతిలో, సత్య మార్గములో నడపండి. సకలమునకు ప్రభువైన పితా, పుత్ర, పవిత్రాత్మ సర్వేశ్వరా

అందరు : ఆమెన్

# ప్రభాత గీతం

## (ఆయా రోజులను అనుసరించి)

గురువు : కరుణానిధియైన సర్వేశ్వరా మీ నామము పరిశుద్ధమగును. మీ భక్తులైన మాపై మీ ప్రేమ మాధుర్యమును కురిపించండి. ఉదయ కాల కీర్తనలతో మిమ్ము స్తుతించుచున్న మమ్ము సకల ఆపదల నుండి రక్షించి నిరంతరము పరిపాలించండి. పితా, పుత్ర, పవిత్రాత్మయైన సర్వేశ్వరా.

అందరు : ఆమెన్, ప్రభువా ఆశీర్వదించండి.

గురువు : ప్రభువా ! మీ పరిశుద్ధమైన త్రిత్వము యొక్క నిగూఢమైన శక్తి, అనంతమైన అనుగ్రహము, నిరంతరమైన సహాయము మాకు దయచేయండి. దుర్మార్గులబారి నుండి మమ్ము రక్షించండి. మా పరలోకపు ప్రయాణములో మాకు సహాయము మరియు అభయము ఒసగి ప్రేమ పూర్వకముగా మమ్ము నడిపించండి. పితా, పుత్ర, పవిత్రాత్మయైన సర్వేశ్వరా.

అందరు : ఆమెన్, ప్రభువా ఆశీర్వదించండి.

గురువు : మా దేవుడైన ప్రభువా! బాధలను అనుభవించువారిని ఓదార్చండి, రోగులను స్వస్థపరచండి. దరిద్రులను సంరక్షించండి. పాపులకు పశ్చాత్తాపమును, మరణించిన వారికి పరలోక భాగ్యమును, నీతిమంతులకు సంతోషమును ప్రసాదించండి. నేడు మిమ్ము స్తుతించు భాగ్యం లభించిన మమ్మందరిని సమృద్ధిగా అనుగ్రహించండి. ఇప్పుడును, ఎప్పుడును + ఎల్లప్పుడును.

అందరు : ఆమెన్

# ఆగమన కాలము

# ఆదివారము

## కీర్తన 93 :1-5

ప్రభువు రారాజు
ప్రభావమును ఆయన వస్త్రముగా ధరించియున్నారు

ప్రభువు నీ సింహాసనము
అనాది కాలమునుండి స్థిరముగా నిలిచియున్నది.

విస్తార జలముల ఘోషముల కంటెను
బలమైన సముద్ర తరంగముల ఘోషముల కంటెను
ఆకాశమందు యెహోవా బలిష్టుడు

ప్రభువు, మీ శాసనములు ఎన్నటికి మారవు
చిరకాలము పవిత్రత మీ మందిరమున నిలిచి యుండును

పితా, పుత్ర, పవిత్రాత్మకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమేన్

## ప్రభాతగీతం

దేవదూతలతో నాథుడు విచ్చేయున్
మేఘపు రథములలో దేవుడు వేంచేయున్

మానవ పాపములన్ కడిగి వేయుటకు
మహిమాన్వితుడైన దేవుడు వచ్చెదరు

మహోన్నత రాజా దేవా పావనుడా
మీ ఘననామమును నిరతం స్తుతించెదము

# సోమవారము

## కీర్తన 1 : 1-3, 5

దుష్టులసలహాలను పాటింపని వాడు
పాపుల మార్గములో పయనించని వాడు ధన్యుడు

అపహాసకులతో సహవాసము చేయని వాడు
ప్రభు ధర్మశాస్త్రమును ధ్యానించుచు
ఆనందించు వాడు ధన్యుడు

అతడు ఏటి ఒడ్డున నాటబడి
ఆకువాడక సకాలము ఫలమునిచ్చు
చెట్టువలె ఉండును
ఆయన చేయునదంతయు సఫలమగును

నీతిమంతుల మార్గము ప్రభువు ఆదరించును
దుష్టుల మార్గము నాశనమునకు నడుపును

పితా, పుత్ర, పవిత్రాత్మకు స్తుతి
ఆది అంత్యము వరకు ఆమెన్

## ప్రభాతగీతం

భారంచే కృంగిన మానవులు
అన్వేషించిరి రక్షకుని
దు:ఖిత జనులు నిరంతరము
స్వాతంత్ర్యమును వెదకెదరు

నిత్య ప్రకాశము క్రీస్తు ప్రభూ !
నిర్మూలించుము చీకటిని
అనుగ్రహములతో నింపండి
పరలోక ద్వారము తెరవండి

# మంగళవారము

## కీర్తన 2 : 6-7, 10-11

నా పరిశుద్ధ పర్వతమైన సీయోను మీద
నా రాజును ఆసీనునిగా చేసియున్నాను
నేను ప్రభువు శాసనమును ప్రకటించెదను

ప్రభువు నాకు ఇలాగు సెలవిచ్చెను
నీవు నా కుమారుడవు
ఈ దినము నీవు నాకు జన్మించితివి

భూపతులారా, మీరు నా హెచ్చరికను ఆలింపుడు
భయభక్తులు కలిగి దేవుని సేవింపుడు
భక్తిపూర్వకముగా ఆయనను స్తుతింపుడు

పితా, పుత్ర, పవిత్రాత్మకు స్తుతి
ఆది అంత్యము వరకు ఆమెన్

## ప్రభాత గీతం

దేవా నీ వాగ్దానం – స్మరించెడి ఈ నిమిషం
మీ ప్రియ జనులకు – దర్శనమొసగండి

పాడెను స్తుతిగీతం – గిరులు పుష్పములు
మోదముతో మీరు – పాడి పొగడండి

దేవుని నామమున – వేంచేయు రక్షకుని
మోదముతో మీరు –పాడి పొగడండి

# బుధవారము

## కీర్తన 147 : 12-20

యెరూషలేమా, ప్రభువును స్తుతించుము
సీయోను నీ దేవుని కీర్తించుము

అతడు నీ కవాటమును బలపరచెను
నీ తనయులను దీవించెను

నీ పొలిమేరలను సురక్షితము చేసెను
మంచి గోదుమలతో నీకు సంతృప్తి కావించెను

ఆయన భూమికి ఆజ్ఞను ఇచ్చెను
ఆయన వచనము అతివేగముగా వచ్చును

ఉన్నివలె హిమమును కురిపించును
నూగుమంచును బూడిదవలె వెదజల్లును

కంకర వలె వడగండ్లను కురిపించును
ఆయన పుట్టించిన చలికి ఎవరు నిలువగలరు?
ఆయన ఆజ్ఞనీయగా మంచు కరిగిపోవును

ఆయన తన వాక్కును ప్రజలకు తెలియజేసెను
తన కట్టడలను న్యాయవిధులను ఇస్రాయేలీయులకు తెలియజేసెను

ఏ జనమునకు ఆయన ఇలాగు చేయలేదు
ఆయన న్యాయవిధులు వారికి తెలియవు

పితా, పుత్ర, పవిత్రాత్మకు స్తుతి
అది అంత్యము వరకు ఆమెన్

## ప్రభాత గీతం

దివిభువి సృష్టికారకుడు – సర్వాధిపతి మన ప్రభువు
నరరూపం దాల్చి ఇలలోన – మన మధ్య తను నివసించెను

> నక్కల కిలలో బొరియలును – పక్షులకు గూళ్ళున్ననూ
> దైవ కుమారునికీ భువిలో – తావులేదయే తలవాల్చుటకు

మార్గము తప్పిన పాపులను – వెదకగ ఏతెంచిన యేసా
కరుణతో మానవ హృదియందు – జన్మించండి ప్రభూ దేవా !

# గురువారము

## కీర్తన 143 : 6-11

చేతులెత్తి నేను నిన్ను ప్రార్థించుచున్నాను
ఎండిన నేల వలె దప్పికగొనుచున్నాను

ప్రభువా, త్వరగా నాకు ప్రత్యుత్తరమిమ్ము
నేను సమాధిలోనికి దిగువారివలె చేయకుము
నీ ముఖము నాకు మరుగు చేయకుము

నేను నడవవలసిన మార్గము నాకు తెలియచేయుము
నా శత్రువుల నుండి నన్ను కాపాడుము

నీవే నా దేవుడవు
నీ చిత్తానుసారము జీవించుట నాకు నేర్పుము

నీ దయగల ఆత్మ సరళ మార్గమున
నన్ను నడిపించును గాక
ప్రభూ, నీవు వాగ్దానము చేసినట్లు నన్ను రక్షింపుము

నీవు న్యాయవంతుడవు కనుక
బాధ నుండి నన్ను తప్పింపుము

పితా, పుత్ర, పవిత్రాత్మకు స్తుతి
ఆది అంత్యముల వరకు ఆమెన్

## ప్రభాత గీతం

సూర్య చంద్ర తారకలు – స్తుతియించు మిమ్ము నిరంతరము
కొండలు కోనలు ఎల్లప్పుడు – పొగడును మీ ఘన నామమును

సముద్రములోని ప్రాణులు – వనమందలి పలు జంతువులు
పక్షులు కిల కిల రాగాలతో – నిరతము మిమ్మే స్తుతియించును

మీ రూపములోని మానవులు – దివ్యానుగ్రహ పాత్రులు
మీ సుత యేసుని అనుచరులు – పాడి స్తుతింతురు ఎల్లప్పుడు

# శుక్రవారము

## కీర్తన 96: 1-12

ప్రభువునకు నూతన గీతము పాడుము
అనుదినము ఆయన రక్షణ సువార్తను ప్రకటింపుము

సమస్త జనులలో ఆయన మహిమలను ఆశ్చరకార్యములను ప్రకటింపుము
ప్రభువు మహోమహుడు ఘనంగా స్తుతింపదగినవాడు

సమస్త దేవతల కంటెను పూజనీయుడు
తేజస్సు ప్రభావమును ఆయనకే చెందును

బల సౌందర్యములు ఆయన పవిత్ర మందిరములో ఉన్నవి
ప్రభువు మహిమాన్విత నామము స్తుతింపుడు

నైవేద్యముతో ఆయన ఆవరణములోనికి రండి
ప్రభువు వేంచేయుచున్నాడు

ఆకాశము ఆనందించును గాక! భూమి హర్షించును గాక!
సముద్రము దానిలోని ప్రాణులు ఘోషించును గాక!

పొలము దానిలోని పైరులును
వనము దానిలోని వృక్షములు సంతోషించును గాక!

పితా, పుత్ర పవిత్రాత్మకు స్తుతి
ఆది అంత్యముల వరకు ఆమెన్

## ప్రభాత గీతం

మీ ఘన నామమును - ఆశ్రయించి ప్రార్థింతుము
శాంతి సమాధానము - ఒసగుము మా దేవా

బంధు మిత్రువులు - నన్ను విడనాడిన
నీవే నా అభయం - శరణము నీవేనయ్యా

పశ్చాత్తాపులకు - మార్గము చూపితివి
కరుణతో పాపులకు - దర్శన మీయుమయా

# శనివారము

## కీర్తన 30: 1-10

ప్రభువా నీవు నన్ను విపత్తు నుండి సంరక్షించితివి
శత్రువులు నా పతనమును చూచి సంతసింపకుండునట్లు చేసితివి
కనుక నిన్ను నేను స్తుతింతును

నా దేవుడవైన ప్రభువా నేను నీకు మొరపెట్టగా
నీవు నన్ను స్వస్థపరచితివి
మరణము నుండి నన్ను రక్షించితివి

ప్రభువు భక్తులారా ఆయనను స్తుతించి కీర్తింపుడు
పవిత్రుడైన ప్రభువును స్మరించుకొని వందనములర్పింపుడు

ఆయన కోపము కొంత కాలం మాత్రముండును
కాని ఉదయము మరల ఆనందము కలుగును

నా క్షేమ కాలమున నాకు కీడు వాటిల్లదని నేను తలంచితిని
నీవు నన్ను కరుణతో పర్వత దుర్గము వలె కాపాడితివి

కాని నీవు నీ ముఖము నా నుండి దాచుకొనగానే
నేను కలత చెందితిని

ప్రభువా నీవు నా మొరను ఆలంచి నా మీద దయ చూపుము
దేవా నన్ను ఆదుకొనుము

పితా పుత్ర పవిత్రాత్మకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

మానవ రక్షణార్థం – నరరూప మెత్తుకొని
తండ్రి చిత్తమును – నెరవేర్చుము దయతో

సహృదయులందరికి – మీ దివ్యాగమనం
శాంతిని పంచువారికి – కాంతిని దయ చేయున్

జనుల రక్షణకై – అరుదెంచె ప్రభుని
ఆనంద గానముతో – స్వాగతమివ్వండి

# క్రీస్తు జయంతి

# కీర్తన 74 : 12-21

## డిసెంబర్ 25, 28, 31

అనాది కాలము నుండియు
దేవా మీరు నాకు రాజువై ఉన్నారు
భూమి అంతట రక్షణ కార్యము నిర్వహించిన రాజు మీరే

మీ మహాబలముతో సముద్రమును పాయలు చేసి
భీకర జంతువులను నాశనం చేసితిరి

మీరు నీటి బుగ్గలను యేరులను చేసితిరి
జీవ నదులను ఎండి పోవునట్లు చేసితిరి

మీరు దివారాత్రములను కలిగించితిరి
సూర్య చంద్రులను నెలకొల్పితిరి

భూమికి సరిహద్దును నియమించితిరి
వేసవి, చలి కాలములు కలిగించితిరి

బాధితులు అవమానముతో వెనుతిరుగునట్లు చేయుము
దీనులు అర్థులైన ప్రజలు మిమ్ము స్తుతించునట్లు చేయుము

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

పశువుల కొట్టములో – రక్షకుడుదయించే
ఈ భువియంతటను – పావన పరచెను

దూతల గణమంతా – భువికి అరుదెంచే
మంగళ గానముల – ధ్వనులు వినిపించే

నరులకు రక్షకుడై – జనియించిన దేవా
నీ పద సన్నిధిని – ఆశ్రయింతుము నిరతం

# కీర్తన 33 : 1 – 11

## డిసెంబర్ 26, 29; జనవరి 1, 3, 5

నీతి మంతులారా ప్రభువునకు ఆనందగానములు ఆలపించుడు
భక్తులారా! మీరు ప్రభువును స్తుతించుట యుక్తము

సితారతో ప్రభువును స్తుతించుడి
దశ తంత్రుల స్వర మండలముతో ఆయనను కీర్తించుడి

ప్రభువు వచనములు సత్యమైనవి
ఆయన చేయునదంతయు నమ్మదగినవి

ఆయన నీతిని న్యాయమును ప్రేమించుచున్నాడు
లోకము ఆయన కృపతో నిండియున్నది

ప్రభువు తన వాక్కుతో ఆకాశమును
సూర్యచంద్ర నక్షత్రాదులను చేసిరి

ప్రభువు ప్రణాళికలు శాశ్వతముగా నిలుచును
ఆయన సంకల్పము తరతరములకు ఉండును

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

# ప్రభాత గీతం

మహోన్నతమున సర్వేశా – భువిలో మంచి మనుజులకు
శాంతి సమాధానమిచ్చుటకు – అరుదెంచిన ఓ శ్రీయేసా

మిమ్ము ఆహ్వానించుటకు – రాజమందిరములు లేవు
పాపినైన నా హృదిలో – జన్మించుము నా రక్షకా

పగయు వైరము విడనాడి – నవలోకమును సృజియించ
ప్రేమ సామ్రాజ్యము స్థాపింప – శక్తిని ఒసగుము నా దేవా

# కీర్తన 34 : 1-8

## డిశంబరు 27, 30; జనవరి 2, 4

నేను ప్రభువునకు ఎల్లవేళల వందనములర్పింతును
నిరంతరము అతనిని కీర్తింతును

ప్రభువు నాకు చేసిన మేలులుకు గాను సంతసింతును
ఈ సంగతిని విని దీనులు సంతోషము చెందుదురు గాక!

మీరును నాతో కూడి ప్రభువును ఘనపరచుడు
మనమందరము కలిసి ఆయన దివ్యనామమును కీర్తింతుము

నేను ప్రభువును ఆశ్రయింపగ ఆయన నాకు ఉత్తరమిచ్చెను
నా భయములెల్ల తొలగించెను

దీనుడు మొరపెట్టగా ప్రభువు ఆలకించెను
సకల బాధల నుండి ఆయనను రక్షించెను

ప్రభువు నందు భయభక్తులు గల వారి చూట్టు
ఆయన దూత కావలియుండి వారిని రక్షించును
దేవుడు ఎంతో ఉత్తముడని రుచి చూసి తెలుసుకొనుడు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

మానవ రక్షకుని – సీమోన్ పూజించి
ఆనందాశ్రువుతో – స్తుతించి ప్రవచించే

శాశ్వత కాంతియును – సత్య మహత్వమును
సర్వ జనావళికి – అభయం మీరేనయా

ప్రభువా పాపులను – కరుణతో వీక్షించు
హృదయపు కన్నులలో – మీ కాంతిని వెదజల్లు

# క్రీస్తు సాక్షాత్కార కాలము

# ఆదివారము

## కీర్తన 127 : 1 - 2

ప్రభువు ఇల్లు కట్టని యెడల
ఇల్లు కట్టువారి శ్రమ వ్యర్థము

ప్రభువు నగరము కాపాడని యెడల
కావలి వారు మేల్కొని ఉండుట వ్యర్థము

ఆహారమునకై కృషి చేయుటకు ఉదయమున లేచుటయు
రాత్రి ఆలస్యంగా నిద్రించుటయు వ్యర్థము

తన ప్రియులు నిద్రించు చుండగ
ఆయన వారికి సంపదలు సమృద్ధిగా ప్రసాదించును

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

మానవ రక్షకుడై
జన్మించిన ప్రభువా
సకల చరా చరముల్
స్తుతులను అర్పించున్

పశ్చాత్తాపమును
కలిగించిన ప్రభువా
పాపులు ఆశలతో
మీ సన్నిధి చేరెదరు

స్వర్గ కవాటములు
తెరచిన మా దేవా
మీ తిరు హృదయమును
పూజించి కీర్తింతుము

# సోమవారము

## కీర్తన 96 : 1-12

ప్రభువునకు నూతన గీతము ఆలపించుము
అనుదినము ఆయన రక్షణ సువార్తను ప్రకటింపుము

సమస్త జనులారా! ఆయన మహిమలను ఆశ్చర్య కార్యములను ప్రకటింపుడు
ప్రభువు మహామహుడు ఘనంగా స్తుతింపదగినవాడు

సమస్త దేవతల కంటె పూజనీయుడు
తేజస్సు ప్రభావమును ఆయనకే చెందును

బల సౌందర్యములు ఆయన పవిత్ర మందిరములో ఉన్నవి
ప్రభువు మహిమాన్విత నామమును స్తుతింపుడు

నైవేద్యములతో ఆయన ఆవరణలోనికి రండి
ప్రభువు వేంచేయుచున్నాడు

ఆకాశము ఆనందించును గాక, భూమి హర్షించును గాక
సముద్రము, దానిలోని ప్రాణులు నినదించును గాక

పొలము, దానిలోని పైరులు
వనము దానిలోని వృక్షములు సంతోషించును గాక

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యములు వరకును ఆమెన్

## ప్రభాత గీతం

దైవ కుమారులుగా – నరులను కావింప
దేవుడు మానవుడై – భువిలో ఉదయించే

దేవుని ఆజ్ఞలను – పాటించు వారందరు
దైవసన్నిధికి – యోగ్యత పొందెదరు

మీ యందు విశ్వాసం – కలిగిన అందరికి
ఆత్మ వరములతో – నింపండి మా ప్రభువా

# మంగళ వారము
## కీర్తన 145 : 1-4, 13

రాజువైన నా దేవా నిన్ను ఘన పరచెదను
నీ నామమును నిత్యము సన్నుతించెదను

అనుదినము నేను నిన్ను స్తుతించెదను
నిత్యము నీ నామమును స్తుతించెదను

ప్రభువు మహా మహుడు
అత్యధికముగా కీర్తింపదగినవాడు
ఆయన మహత్వమును మనము గ్రహింపజాలము

అతడు అందరికి మేలు చేయును
ఆయన కనికరము సమస్త కార్యముల మీద ఉన్నది

ప్రభువు తన వాగ్దానములను నిలబెట్టుకొనును
అతని కార్యములెల్లా కరుణ నిండి యుండును

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

మానవులందరి పాపములు - మోసెడి దేవుని గొఱ్ఱెపిల్ల
నరులకు విడుదల కలిగించే - పరమోన్నతుని సుతుడిదిగో

గలిలీయ సాగర తీరమున - దైవ కుమారుని కనుగొంటిని
దేవుని రాజ్యం సమీపించెను - అని బోధించెను ఆ ప్రభువు

అంధులకొసగెను చూపును - బధిరులకొసగెను శ్రవణమును
మరణపు బంధము విప్పబడే - నూతన జీవం ఒసగబడే

# బుధవారము

## కీర్తన 92: 1 - 6

దేవా నిన్ను స్తుతించుట
నీ నామమును కీర్తించుట శ్రేయస్కరము

ప్రతి ఉదయము నీ కృపను
రాత్రి నీ విశ్వసనీయతను ప్రకటించుట మేలు

ప్రభువా, నీ కార్యములు ఎంత ఘనమైనవి
నీ ఆలోచనలు ఎంత లోతైనవి

మూర్ఖులు ఈ సంగతిని గుర్తింపజాలరు
అజ్ఞానులు ఈ అంశమును గ్రహింపజాలరు

దుష్టులు కలుపు వలె ఎదిగినను
దుర్మార్గులు వృద్ధి చెందినను నాశనమగుదురు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

అధికముగ పండెను పొలము
ఉంచుటకు లేదాయె స్థలం
నవ గిడ్డంగులు నిర్మించెదను
జీవించెదను నిర్భయంగా

సంవత్సర మంత వాడినను
తరగదు నా సంపాదనము
భోజన పాన విందులతో
ఆనందములో తేలెదను

ఓరి అవివేకిక ఎన్ని రోజులు
పగటి కలల ఆనందం
ఈ దినమే నీ అంత్యదినం
సంపదలొసగవు సౌభాగ్యం

# గురువారము

## కీర్తన 65 : 8 - 13

నీ సూచక క్రియలను చూసి భూవాసులందరు భయపడుదురు
ఉదయ సాయంత్రముల మహనీయ శోభలో
భూవాసులందరు ఆనంద భరితులగుదుదరు

మీరు భూమిని సందర్శించి దానిపై వర్షము కురిపింతురు
దానిని మహా ఐశ్వర్యములతో నింపుదురు

మీ నదులు నీటితో నిండియున్నవి
మీరు భూమిని సారవంతముగా చేయుచున్నారు

పచ్చిక పట్టులలో గొఱ్ఱెల మందలు వస్త్రము కప్పినట్లున్నవి
లోయలు పైరు పంటలతో నిండియున్నవి
అవి ఆనందగానము చేయుచున్నవి

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

సువిశేష మార్గములో – సైతాను ప్రవేశించే
సత్యపథం వదిలి – క్షణసుఖం ఆశించిరి

మానవ హృదయములో – చల్లిన వచనములు
పరిపోషణ మొసగి – సంరక్షించుమయా

పశ్చాత్తాపపు – మార్గములో మేము
నడుచుటకు ప్రభువా – మీ కృపనొసగండి

# శుక్రవారము

## కీర్తన 147 : 1-9

ప్రభువును స్తుతించుట యుక్తము
ఆయనను కీర్తించుట ఆనందాయకము

ప్రభువు యెరూషలేమును పునరుద్ధరించెను
యిస్రాయేలు బందీలను స్వంత దేశమునకు కొనివచ్చెను

భగ్న హృదయుల బాధలు తీర్చి
వారి గాయములకు కట్టు కట్టెను

నక్షత్రములను ఆయన లెక్కపెట్టును
వాటన్నిటికి పేరు పెట్టుచున్నాడు

మన ప్రభువు మహా శక్తిమంతుడు
అపారమైన జ్ఞానము కలవాడు

ప్రభువు దీనులను లేవనెత్తును
దుష్టులను నేలకు అణగద్రొక్కును

కృతజ్ఞతా స్తుతులతో యెహోవాను కీర్తించుడి
ఆయన ఆకాశమును మేఘములతో కప్పును, నేలపై వానలు కురియించును

పశువులకు పక్షులకు
ఆయన ఆహారమొసగును

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

# ప్రభాత గీతం

దేవుడు తోడుంటే -నాకిక భయము లేదు
నా ప్రభు సన్నిధిలో - ఏ కొదువయు లేదు

ప్రభువా సర్వేశా - మీరే మా దైవం
మీ కర స్పర్శనలో - తొలగును దు:ఖములు

ఇహ పరములను - సృజించిన ప్రభు దేవా
కీర్తింతుము మేము - మీ ఘన నామమును

# శనివారము

## కీర్తన 101 : 1 - 6

నేను కృపను గూర్చి న్యాయమును గూర్చి పాడెదను
దేవా నిన్ను కీర్తించెదను

నేను ధర్మ మార్గమున ప్రవర్తించెదను
ప్రభూ! మీరు నా చెంతకు ఎప్పుడు వచ్చెదరు

నేను ఇంట యదార్థ హృదయముతో జీవించెదను
దుష్కార్యముల మీద నేను దృష్టి నిలుపను

నిర్మల హృదయులను నేను అంగీకరింతును
ఋజువర్తనులైన వారు నాకు మిత్రులగుదురు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

శ్రద్ధతో చెట్లను పెంచినను
ఫలము లేదాయే ఎన్నటికి
నరికి అగ్నిలో వేయండి
భూమికి ఎరువుగా వాడండి

ప్రభువా అనుమతి ఇచ్చినచో
సాగుచేసెద అతిశ్రద్ధతో
ఫల శూన్యముగ మారినచో
కాల్చి ఎరువుగా వేయుదుము

మీ తిరు వాక్యము పాటించి
ధన్య జీవితము పొందితిమి
ప్రభువా మీ కృపతో మాపై
ఆత్మ వరమును నింపండి

# తపస్సు కాలము

# ఆదివారము

## కీర్తన 116 : 1,3,4,5,6,7

ప్రభువు నా మొరను, విన్నపమును ఆలించును
కనుక నేను ఆయనను ప్రేమింతును

మరణ బంధములు నన్ను చుట్టుముట్టెను
పాతాళ వేదనలు నన్ను ఆవరించెను

అపుడు నేను ప్రభువునకు మొరపెట్టితిని
"ప్రభు! నీవు నన్ను రక్షింపుమని" వేడుకొంటిని

ప్రభువు నిష్కపట హృదయులను కాపాడును
నేను ఆపదలోనున్నపుడు నన్ను ఆదుకొనెను

నా ఆత్మమా! నీవు నమ్మకముతో ఉండుము
ప్రభువు నీకు మేలు చేసెను

ప్రభువు నన్ను మృత్యువు నుండి రక్షించెను
నా కన్నీటిని తుడిచెను, పతనము నుండి నన్ను కాపాడెను
కనుక సజీవుల లోకములో సంచరింతును

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

ఆదాము పాపము వలన – కోల్పోతిమి కృపానుగ్రహం
పాపపు మరణపు బంధముతో – శోకించెను ఈ జగమంత

నిరాశతో నిండిన హృదయములు – విశ్వాసపు అనుగ్రహంతో
దీవింపబడి నందులకు – ఆరాధించి స్తుతించుదము

లోకాశల సుడిగుండములో – మునిగి నశించిన మనుషులకు
శాశ్వత శాంతిని వెదజల్లి – హృదయానందము కలిగించు

# సోమవారము

## కీర్తన 116 : 12-19

ప్రభువా, మీరు చేసిన మేలులకు
నేనేమి చెల్లింతును

రక్షణ పాత్రను కరములతో వహించి
నేను ప్రభువు నామమున ప్రార్థింతును

నీతిమంతుల మరణము
దేవుని దృష్టిలో విలువైనది

నేను నీ దాసుడను
మీరు నా మృత్యువు బంధములను విప్పితిరి

నేను మీకు కృతజ్ఞతా బలిని అర్పింతును
మీకు వందనములు చెల్లింతును

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

దేవుడు మనిషికి జీవం పోసే
వృక్షము నరునికి మరణం తెచ్చే
దివ్య కుమారుని మరణముతో
సిలువ నరులకు జీవమిచ్చే

లోకము దాని ఆశలును
క్షణభంగురమని మరువకుము
సత్యము నీతియు సతతముగా
శాశ్వత దీపముననుసరించు

సజ్జనులకు దేవుని తీర్పు
ఆనందామృతం కలుగ చేయున్
దుర్జనులకు దండనము
ఒసగెదరని మేమెరుగుదుము

# మంగళ వారము

## కీర్తన 138 : 1 - 8

ప్రభువా నేను నీకు హృదయపూర్వకముగా వందనములర్పింతును
దైవముల ఎదుట నేను నిన్ను కీర్తింతును

నీ ప్రేమను విశ్వసనీయతను చూచి
నీ పవిత్ర మందిరమువైపు మరలి
శిరము వంచి నీకు వందనములర్పింతును

నేను మొర పెట్టగ నీవు నాకు ఉత్తరమిచ్చితివి
నీ శక్తితో నన్ను బలపరచితివి

ఈ లోక రాజులందరు మీరు సెలవిచ్చిన మాటలు విని
మీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించెదరు

మహోన్నతుడైనను ఆయన దీనులను గమనించును
దూరము నుండి అహంకారులను పరికించును

ప్రభువా నా శత్రువుల నుండి నన్ను రక్షింపుము
ఏలయన నీ కృప అనంతమైనది

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

మానవ జీవితం ఇలలోన
శాశ్వతం కాదు ఎన్నటికి
దూతల కాహళ నాదముతో
ఆసన్నమగును అంత్య దినం

మన ప్రభు యేసు బోధించే
పశ్చాత్తాప మార్గమును
మీ పాపములను ఒప్పుకొని
కన్నీటి ప్రార్థన చేయండి

# బుధవారము

## కీర్తన 74: 16-22

దిన రాత్రములను కలిగించితివి
సూర్య చంద్రులను నెలకొల్పితివి

భూమికి సరిహద్దులు నియమించితివి
వేసవిని చలికాలమును సృజించితివి

ప్రభువా, మీ శత్రువులు నిన్ను దూషణ చేయుటను
అవివేక ప్రజలు నీ నామమును దూషించుటను మనస్సుకు తెచ్చుకొనుడు

పీడితులైన నీ ప్రజలను విస్మరింపకుము
మీ నిబంధనమును స్మరింపుము

బాధితులు అవమానముతో వెను తిరుగుతున్నట్లు చేయకుము
దీనులును ఆర్తులునైన ప్రజలు మిమ్ము స్తుతించునట్లు చేయుము

పితా పుత్ర పవిత్రాత్మకు స్తుతి
ఆది అంత్యముల వరకు ఆమెన్

## ప్రభాత గీతం

దేవుని పావన అధరములు
పలికే నిర్మల వచనములు
జీవము హృదయానందమును
ఒసగును సర్వజనావళికి

అనుతాపులను దరిచేర్చే
కరుణామయుడగు శ్రీ యేసా
అనుతాపముతో మీదరిచేరి
పావన పాదముల్ పూజింతును

దినదినం చేసే ప్రార్థనలో
పావన జీవిత మార్గంలో
ప్రభునకు ప్రీతిని కలిగించి
శాశ్వత శాంతిని పొందండి

# గురు వారము

## కీర్తన 60 : 1 - 2,4

దేవా మమ్ము విడనాడితివి, మమ్ము ఓడించితివి
మీరు మాపై కోపించితిరి, ఇప్పుడు మా చెంతకు తిరిగి రమ్ము

మీరే దేశమును కంపింప చేసితిరి
దానిని బ్రద్ధలు చేసితిరి

నీ యందు భయభక్తులు గలవారిని
నీ చెంతకు చేరదీసితివి
వారిని శత్రువుల బారి నుండి కాపాడితివి

మా మొర వినుడు
మీ బలముతో మమ్ము కాపాడుడు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

ప్రభువా పాపమును
చేసితి ప్రతి దినము
కరుణను వర్షించి
దీవించుమా ప్రభువా

పాపపు శోధనలు
వదిలే శక్తి లేదు
కృపయు మోచనము
ఒసగుము నా కిలలో

# శుక్రవారము

## కీర్తన 22 : 1 - 11

నా దేవా నా దేవా నీవు నన్నేల విడనాడితివి
నన్ను రక్షింపక, నా ఆర్తధ్వని వినక నీవేల దూరముగానున్నావు

నీవు పరమ పవిత్రుడవు
ఇస్రాయేలీయుల స్తుతుల సింహాసనము మీద ఆసీనుడవై ఉన్నావు

మా పితరులు నిన్ను నమ్మిరి
నీవు వారిని రక్షించితివి

నేను నరుడను కాను నేను పురుగును
నరులచే నిందింపబడిన వాడను
ప్రజల చేత తృణీకరింపబడిన వాడను

నన్ను చూసి వారందరు పెదవులు విరిచి
నన్ను అపహసించుచున్నారు

ఇతడు ప్రభువును నమ్మెను
అతడు ఇతనిని రక్షించునేమో చూతము

ఇతడు ప్రభువునకు ఇష్టుడైనచో
అతడు ఇతనిని కాపాడునేమో చూతము అని అనుచున్నారు

మాతృ గర్భము నుండి వెలువడినప్పటి నుండియు
నేను నీ మీదనే ఆధారపడితిని
నా జన్మము నుండియు మీరే నాకు దేవుడవు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

మనుజుల రక్షణకై - సిలువ మరణమును
పొందిన ప్రభు యేసా - మీకే వందనము

మా సిలువనెత్తుకొని - మీ వెంబడి మేము
అనుసరించెద మిలలో - ప్రభువా నా దేవా

# శనివారము

## కీర్తన 44 : 1 - 8

దేవా నీవు పూర్వము మా పితరులకు చేసిన
మహా కార్యములను గూర్చి మా పితరుల ద్వారా మేము వింటిమి

నీవు అన్య జాతులను ఓడించి
వారి దేశమున నీ ప్రజలను నెలకొల్పితివి

వారు తమ బాహు బలం వలన శత్రువులను ఓడించలేదు
నీ సాన్నిధ్యమే వారికి విజయం కలుగ చేసెను

కనుక నీ నామమునకు మేము
నిత్యము స్తుతులర్పింతుము

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

నరులకు స్వర్గము దయచేయ
మానవ రూపము దాల్చితివి
నిరతము మీ ప్రేమ భావముతో
మా మనస్సులను నింపండి

నరులకు జీవము దయచేయ
ప్రాణార్పణము చేసితివి
నిర్మల హృదయాలను నిరతం
దీవించండి ప్రియ తండ్రీ

# పునరుత్థాన కాలము

# ఆదివారము

## కీర్తన 98 : 1 - 8

ప్రభువునకు క్రొత్త కీర్తన పాడుడు
అతడు అద్భుత కార్యములు చేసెను

అన్య జనులకు తన నీతిని తెలియజేసెను
భూదిగంత వాసులందరు మన దేవుడు కలుగజేసిన రక్షణము చూసిరి

ఇస్రాయేలీయుల పట్ల ప్రేమను విశ్వసనీయతను చూపుదునన్న
తన ప్రమాణమును నిలబెట్టుకొనెను
సితార స్వరముతో ప్రభువునకు స్తోత్ర గీతములు పాడుడి

తంత్రీ వాద్యములను ఊది మన దేవుని స్తుతింపుడు
భూమియు దానిలోని వాసులును
ఆనంద నాదము చేయును గాక!
సముద్రము దానిలోని జీవులు ఘోషించును గాక!

నదులు ఉత్సాహ ధ్వనులు చేయును గాక
పర్వతములు ఏకమై సంతోష నాదము చేయును గాక!

ప్రభువు లోకమునకు తీర్పు తీర్చుటకు వేం చేయును
అతడు న్యాయముగా సమస్త జనులకు తీర్పు తీర్చును

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకున్ ఆమెన్

## ప్రభాత గీతం

నేనే పునరుత్థానమును – నేనే శాశ్వత జీవమును
నన్ను నమ్మిన మానవులు – శాశ్వత జీవము పొందెదరు

మన క్రియలకు తగు ప్రతి ఫలము – తప్పక ఒసగును ప్రభు యేసు
సజ్జనులకు మోక్షమును – దుర్జనులకు నరకమును

# సోమవారము

## కీర్తన 147 : 1 - 9

ప్రభువును స్తుతించుట యుక్తము
ఆయనను కీర్తించుట ఆనందదాయకము

ప్రభువు యెరూషలేమును పునరుద్ధరించెను
యిశ్రాయేలు బందీలను స్వంత దేశమునకు కొనివచ్చెను

భగ్న హృదయుల బాధలు తీర్చి
వారి గాయములకు కట్టు కట్టెను

నక్షత్రముల సంఖ్యను ఆయన నియమించుచున్నాడు
వాటికి పేరు పెట్టుచున్నాడు

మన ప్రభువు మహా శక్తిమంతుడు
అపారమైన జ్ఞానము కలవాడు

ప్రభువు దీనులను లేవనెత్తును
దుష్టులను నేలకు అణగద్రొక్కును

కృతజ్ఞతా స్తుతులతో యెహోవాను కీర్తించుడి
సితారతో మన దేవుని కీర్తించుడి

ఆయన ఆకాశమును మేఘములతో కప్పును
నేలపై వానలు కురిపించును
కొండలపై గడ్డి మొలపించును

పశువులకును, పక్షులకును
ఆయన ఆహార మొసగును

పితా పుత్రా పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

సాతానపజయము – మానవ మోచనము
పునరుత్థానముతో – స్థాపించెను యేసు
పరమానందము పొందిన మానవులు
ఆనందగానములు పాడిరి ప్రభువునకు
పాప కళంకముతో – నిండిన హృదయములు
నూతన జీవమునకు – అర్హతను పొందె

# మంగళ వారము

## కీర్తన 149 : 1-5

ప్రభువునకు నూతన గీతము పాడుదును
భక్తుల సమాజమున అతనిని స్తుతింతును

యిస్రాయేలీయులు తమ సృష్టికర్తను చూచి ఆనందింతురు గాక!
సీయోను పౌరులు తమ రాజును గాంచి సంతసింతురు గాక!

నాట్యముతో అతనిని స్తుతింతురు గాక!
తంబురతో సితారతో ఆయన నామ సంకీర్తనం చేయుదురు గాక!

ప్రభువు తన ప్రజలను గాంచి ప్రీతి చెందెను
దీనులకు విజయమును ప్రసాదించెను

పగలు రాత్రంతయు సంతోషముతో గానము చేయుదురు గాక!
భక్తులు హర్షింతురు గాక!

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యము వరకును ఆమెన్

## ప్రభాత గీతం

స్వంత ప్రాణమును సంరక్షించుటకు
శ్రమ పడువారు జీవము కోల్పోవుదురు

తన ప్రాణం ప్రభుకై త్యాగం చేయువారు
పరలోక మహిమకు అర్హత పొందెదరు

పాపపు బ్రతుకు నుండి శాశ్వత మోచనము
నూతన జీవితము ఒసగుడి అఖిలేశా

# బుధవారము

## కీర్తన 108 : 1 - 6

దేవా నా హృదయము సిద్ధముగా నున్నది
పాడుచు మీకు స్తుతి గానము చేసెదను

స్వర మండలమా సితారమా మేలుకొనుడు
నేను వేకువనే లేచెదను

ప్రజల మధ్య నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లింతును
వారి మధ్య నిన్ను కీర్తింతును

మీ కృప ఆకాశమంత ఉన్నతమైనది
మీ విశ్వసనీయత మేఘమండలమంత ఎత్తయినది

మీ ప్రియులు విమోచింపబడునట్లు
మీ కుడి చేతితో నన్ను రక్షించి నాకు ఉత్తర మిమ్ము

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

శ్రమ పడినారు రాత్రంతా
నిష్ఫలమాయే ఆ శ్రమలు
వినయముతో ప్రభు శిష్యులు
వినిపించిరి వారి దీనతను
యేసుని ఆజ్ఞను అనుసరించి
వలవేసిన ఆ శిష్యులు
పొందిరి సత్ఫలితములను
పొగడిరి ప్రభు ధన్యనామమును

ప్రభువా మీ ఘన మహిమలతో
విస్మయ మొందిరి జనమంతా
అద్భుతమైన మీ క్రియలు
నింపెను సంతోషమందరిలో

# గురువారము

## కీర్తన 96 : 1-12

ప్రభువునకు నూతన గీతము ఆలపించుము
అను దినము ఆయన రక్షణ సువార్తను ప్రకటింపుము

సమస్త జనులారా! ఆయన మహిమలను ఆశ్చర్యకార్యములను ప్రకటింపుడు
ప్రభువు మహామహుడు ఘనంగా స్తుతింపదగినవాడు

సమస్త దేవతల కంటె పూజనీయుడు
తేజస్సు ప్రభావమును ఆయనకే చెందును

బల సౌందర్యములు ఆయన పవిత్ర మందిరములో ఉన్నవి
ప్రభువు మహిమాన్విత నామమును స్తుతింపుడు

నైవేద్యముతో ఆయన ఆవరణలోనికి రండు
ప్రభువు వేం చేయుచున్నాడు

ఆకాశము ఆనందించుగాక, భూమి హర్షించును గాక!
సముద్రము దానిలోని ప్రాణులు నినదించును గాక!

పొలము దానిలోని పైరులును
వనము దానిలోని వృక్షములు సంతోషించును గాక!

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకు ఆమెన్

## ప్రభాత గీతం

పుట్టుక నుండియే - పాప ప్రభావములో
జీవించే నరుని - కరుణించు మా ప్రభువా

పరివర్తన మొకటే - జీవిత మార్గములో
నిత్య మహోన్నతము - ప్రభునకు ఆనందం

నరులకు భోజనమై - విచ్చేసిన ప్రభుని
దివ్యాహారముకై - సిద్ధపడుదాం మనము

# శుక్రవారము

## కీర్తన 97 : 1-6

ప్రభువు రాజ్యము ఏలుచున్నారు
భూలోకము ఆనందించును గాక

మేఘమును తమస్సును ఆయన చుట్టునుండును
నీతి న్యాయము ఆయన సింహాసనమునకు పునాదులు

అగ్ని ఆయనకు ముందు పోవుచు
ఆయన శత్రువులను భస్మము చేయును

అతని మెరుపులు లోకమును వెలిగించును
ఆ దృశ్యమును చూచి భూమి కంపించును

ఇహపరములకు అధిపతియైన ప్రభువును గాంచి
కొండలు మైనము వలె కరిగి పోవును

ఆకాశము ఆయన న్యాయమును ప్రకటించును
సకల జాతులు ఆయన తేజస్సును దర్శింతురు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

పరలోకములో కడ తీర్పు
మీరిచ్చే సమయము వచ్చినది
మేకలను, గొర్రెలను
వేరు చేయునట్లు మమ్ము చేసెదరు

మహిమాన్విత మగు సిలువతో
మేఘరథముపై దిగిరాగా
ప్రభువా మమ్ము కరుణించి
సజ్జనులతో చేర్చండి

# శనివారము

## కీర్తన 150 : 1 - 6

ప్రభువు మందిరమున ఆయనను స్తుతింపుడు
విశాలాకాశమున ఆయన బలమును స్తుతింపుడు

ఆయన పరాక్రమ కార్యములకుగాను ఆయనను స్తుతింపుడు
ఆయన మహా ప్రభావములకు గాను ఆయనను స్తుతింపుడు

బూరలనూది ఆయనను స్తుతింపుడు
స్వరమండలముతో సితారతో ఆయనను స్తుతింపుడు

తంబురతో నాట్యముతో ఆయనను స్తుతింపుడు
తంత్రీ వాద్యముతో పిల్లన గ్రోవితో ఆయనను స్తుతింపుడు

మ్రోగు తాళముతో ఆయనను స్తుతింపుడు
గంభీర నాదము గల తాళములతో ఆయనను స్తుతింపుడు

సకల ప్రాణులు ఆయనను స్తుతించును గాక!
మీరు ప్రభువును స్తుతింపుడు

పితా పుత్రా పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

సమాధి ద్వారము తెరువబడె
కావలి సైన్యము భయపడెను
యేసు పతాకము జయమొందెను
మరణ కవాటము నశించెను

స్వాతంత్ర్యపు సూచనలు
ఆనందమును వెదజల్లె
మానవులందరి దుష్క్రియలు
ప్రభువు ద్వారా అంతమొందెన్

# అపోస్తలుల కాలము
# మరియు
# సభావికాస కాలము

# ఆదివారము

## కీర్తన 17 : 1 - 9

ప్రభూ! న్యాయయుక్తమైన నా ప్రార్థనలు ఆలింపుడు
నిష్కపటమైన నా ప్రార్థనలు అంగీకరింపుడు

మీరు న్యాయవంతులు కనుక
నాకు అనుకూలముగా తీర్పు చెప్పుదురు గాక!

మీరు నన్ను పరిశీలించి చూచిరి
కాని, నా యందు ఎట్టి దురాలోచనలు కానరాలేదు

నేను దుర్భాషలాడలేదు
నీ ఆజ్ఞలు పాటించి మీ మార్గముననే నడిచితిని

నాకు నీ కృపను చూపుడు
నన్ను నీ కంటి పాప వలె కాపాడుడి

పితా పుత్రా పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

క్రీస్తుని శిష్యులుగా - చేయుటకు ప్రభువు
నరులను పిలిచెను - ఆజ్ఞను ఒసగెను

శిష్యులు అందరు - వాక్యము బోధించి
పాపులు అందరికి -సన్మార్గం చూపించిరి

ఓ పరిశుద్ధాత్మ - శక్తిని ఒసగుమయా
పరిశుద్ధ జీవితము నిరతము జీవింప

# సోమవారము

## కీర్తన 77 : 13 - 20

నీ మహాకార్యములను నేను ధ్యానించెదను
నీ క్రియలను నేను ధ్యానించుకొందును

దేవా నీ క్రియలు పవిత్రమైనవి
నీ వలే ఘనుడైన దేవుడెవరు?

మీరు అద్భుత కార్యములు చేసితిరి
నిఖిల జాతులలో మీ శక్తిని ప్రత్యక్ష పరిచితిరి

మీ బాహు బలం వలన యాకోబు యోసేపుల సంతతి వారగు
మీ ప్రజలను మీరు రక్షించితిరి

దేవా మిమ్ము జూచి జలములు భయపడును
సముద్రపు అగాధము కంపించెను

మేఘరాసులు నీళ్లు దిమ్మరించెను
ఆకాశము గర్జించెను

మోషే ఆహరోనుల ద్వారా నీ ప్రజలను
మందవలె నడిపించుకొని పోయితివి

పితా పుత్రా పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

స్వర్ణము వెండియు లేదనిరి
వినయాన్వితమై శిష్యగణం
నజరేయుడేసుని నామమున
లెమ్ము నడువు వేగముగా

దుర్భలవికలాంగుడు వడిగా
బలమార్జించి నడిచెను
ప్రేక్షకులందరు సంతసించి
దేవుని మహిమను పొగిడిరి

# మంగళవారము

## కీర్తన 118 : 4 - 12

దేవుడు దయామయుడు
ఆయన కృప నిరంతరం ఉండును
ఆయనకు కృతజ్ఞతా స్తోత్రములు అర్పింపుడు

నా వేదనలో నేను ప్రభువును ప్రార్థించితిని
ఆయన నన్ను ఆదుకొనెను

ప్రభువు నా పక్షమున ఉండగా
నేను భయపడను

నరులను నమ్ముట కంటే ప్రభువును ఆశ్రయించుట మేలు
రాజులను నమ్ముటకంటే ప్రభువును ఆశ్రయించుట మేలు

యెహోవా నా దుర్గము నా గానము
ఆయన నాకు రక్షణాధారమాయెను

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

భూమి, ఆకాశములు
సర్వచరాచరము
సృష్టించి దేవుడు
నరులకు దయచేసే

తన రూపములోనే
నరుని సృజియించి
జ్ఞానమునొసగిన
ప్రభువా నీకే స్తుతి

# బుధవారము

## కీర్తన 98 : 1 - 9

ప్రభువునకు క్రొత్త కీర్తన పాడుడు
అతడు అద్భుత కార్యములు చేయును

అన్యజనులకు తన నీతిని తెలియచేసెను
భూదిగంత వాసులందరు మన దేవుడు కలుగ చేసిన రక్షణము చూసిరి

ఇశ్రాయేలీయుల పట్ల ప్రేమను విశ్వసనీయతను చూపుదునన్న
తన ప్రమాణమును నిలబెట్టుకొనెను

సితార స్వరములతో ప్రభువునకు స్తోత్రములు పాడుడి
కాహళమును ఊది దేవుని స్తుతింపుడు

భూమియు, దానిలోని నివాసులును
ఆనంద నాదము చేయును గాక

సముద్రము, దానిలోని
జీవులు గర్జించు గాక

నదులు ఉత్సాహ ధ్వనులు చేయును గాక!
పర్వతములు ఏకమై సంతోషగానము చేయును గాక!

ప్రభువు లోకమునకు తీర్పు తీర్చుటకు వేంచేయును
అతడు న్యాయముగా సమస్త జనులకు తీర్పు తీర్చును

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

పెనుగాలి వర్షము వలన - వరదలు పొంగి ప్రవహించే
రాతిపై నిర్మించిన బలమైన - భవనము పతనము కాలేదు

ప్రభువుపై నమ్మకము వుంచువారు-భయమొందరు ఇక ఎన్నటికీ
కష్టదు:ఖములొచ్చినను - ప్రభువే సర్వమని విశ్వసింతురు

తైలము నింపిన దీపముతో - జాగరూకులైన కన్యలకు
ప్రీతి చెందిన ప్రభు యేసు - బహుమానమును దయచేసెను

# గురువారము

## కీర్తన 135 : 1 - 13

దేవుని మందిరపు ఆవరణములో పరిచర్య చేయువారలారా
ప్రభువు నామమును స్తుతింపుడు

ఆయన యాకోబును ఎన్నుకొనెను
తనకు జాతిగా ఇస్రాయేలును ఏర్పరచుకొనెను

ప్రభువు మహోమహుడనియు
సమస్త దేవతల కంటె అధికుడనియు నేనెరుగుదును

ఆకాశమునందు, భూమియందు
సముద్రమునందు, పాతాళమునందు
ఆయన తనకు ఇష్టమైన దంతయు చేయును

భూదిగంతముల నుండి ఆయన ఆవిరి లేపును
వాన కురియునట్లు మెరుపును కలిగించును

ఫరో ఎదుట సూచక క్రియలను
మహోత్కార్యములను జరిగించెను

ప్రభూ! నీ నామము నిత్యము నిలుచును
మీ నామము తరతరములుండును

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకున్ స్తుతి

## ప్రభాత గీతం

సీమోన్ వచనములు - ఆలించిన రోగి
అద్భుతకమైన స్వస్థత పొందెను

కరములు పైకెత్తి యేసుని కీర్తించే
అంజలి హస్తముతో వందన మర్పించే

కరుణా సాగరుడ - రక్షించు జనులను
శాంతి, ఐక్యతను ఒసగి నడిపించు

# శుక్రవారము

## కీర్తన 16 : 1 - 11

ప్రభూ నన్ను కాపాడుము
నేను మిమ్ము శరణు వేడుచున్నాను

మీరు నాకు దేవుడు
మీ కంటె నాకు క్షేమాధారము లేదని
దేవునితో నేను మనవి చేసెదను

ప్రభువే నాకు వారస భూమి, నాకు పాన పాత్రము
నా ప్రాణము అతని అధీనమున వున్నది
నాకు లభించిన వారస భూమి అతి శ్రేష్ఠమైనది

ప్రభువు నాకు హితోపదేశము చేయును
కనుక నేను అతనిని స్తుతించుచున్నాను
రాత్రులందు నా అంతరాత్మ నాకు బోధించుచున్నది

నేను ప్రభువును నిత్యము నా కన్నుల యెదుట నిలుపుకొందును
అతడు నన్ను కాపాడును

అందువలన నా హృదయము సంతోషించుచున్నది
నా ఆత్మ ఆనందించుచున్నది

నా శరీరం కూడా సురక్షితముగా వున్నది
మీరు నన్ను పాతాళములో వదిలివేయరు

నీ పరిశుద్ధుని కుళ్ళు పట్టనీయవు
జీవమార్గము మీరు నాకు తెలియచేసితిరి

మీ సన్నిధిలో సంపూర్ణ సంతోషము కలదు
మీ కుడిచేతిలో శాశ్వత ఆనందం కలదు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

మానవ రక్షణకై - సిలువ మరణమును
పొందిన ప్రభు యేసును - నిరతం స్తుతియింతుము

మీ తిరు నామమున - అంధులకు చూపు
మృతులకు నవజీవం - కలుగునుగా నిరంతరం

రక్షణ ఒసగునది - మీ నామము తప్ప
వేరొక నామము - ధరయందు లేదు

# శనివారము

## కీర్తన 40 : 6 - 11

నీవు బలిని, సమర్పణను కోరవు
దహన బలిని పాప పరిహార బలిని అభిలషించవు
మీ ఆజ్ఞలు అనుసరించుటకు మాకు వీనులొసగితిరి

నా దేవా మీ చిత్తము నెరవేర్చుట నాకు సంతోషము
మీ ధర్మశాస్త్రము నా అంతరంగములో ఉన్నది

భక్త సమాజమున నేను నిరీక్షణ ప్రకటన చేసితిని
మీ రక్షణమును గూర్చిన శుభ సమాచారమును
నేను పదిలముగా దాచి ఉంచలేదు

యెహోవా నీవు నీ విశ్వసనీయతను నాకు దూరము చేయవు
నీ కృపా సత్యములు ఎప్పుడు నన్ను కాపాడును గాక

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

దేవా మీ ప్రియ శిష్యగణం
హృదయైక్యముతో జీవించి
ఆనందములో దు:ఖములో
సోదరభావం చూపించిరి

తాత్కాలికమైన సంపదలు
సంతోషముతో విభజించిరి
ఆకలి దప్పితులందరికి
సాయం చేసిరి మీ శిష్యులు

సృజియించిరి నవలోకమును
అద్భుతకరమగు స్నేహముతో
ప్రజలను శిష్యులు ప్రభువైపు
ఆకర్షించిరి మోదముతో

# ఏలియా స్లీవ మోషే కాలము

# ఆదివారము

## కీర్తన 127 : 1 - 2

ప్రభువు ఇల్లు కట్టని యెడల
ఇల్లు కట్టువారి శ్రమ వ్యర్థము

ప్రభువు నగరం కాపాడని యెడల
కావలి వారు మేల్కొని ఉండుట వ్యర్థము

ఆహారమునకై పని చేయుటకు ఉదయమున లేచుటయు
రాత్రి ఆలస్యంగా నిద్రించుటయు వ్యర్థము

తన ప్రియులు నిద్రించు చుండగ
ఆయన వారికి సంపదలు సమృద్ధిగా ప్రసాదించును

పితా పుత్రా పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

భూమి ఆకాశముల
మధ్యలో మీ సిలువ
నిలుచుండి అంతటికి
కాంతిని విరజిల్లే

ఈ లోక జీవితపు
అంతిమ దినములలో
సిలువపై మరణించి
రక్షణ మాకొసగే

సిలువను మోసుకొని
మిమ్ము అనుసరింప
కల్వరి గిరి చేర
వరమొసగు ప్రభువా

# సోమవారము

## కీర్తన 46 : 1 - 3, 7 - 8

దేవుడు మనకు ఆశ్రయమును దుర్గమునై ఉన్నాడు
ఆపదలో ఆయన నమ్మదగిన సహాయకుడు

భూమి కంపించినను, పర్వతములు సాగరగర్భమున కూలినను
మనము భయపడనక్కరలేదు

సైన్యములకు అధిపతియగు ప్రభువు మనకు తోడై ఉన్నారు
యాకోబు దేవుడు మనకు ఆశ్రయమై ఉన్నారు

రండు ప్రభువు కృత్యములను దర్శింపుడు
భూమి మీద ఆయన సల్పిన మహా కార్యములను వీక్షింపుడు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

వినయాన్వితమైన
దూతల బృందములు
అంజలి హస్తముతో
సిలువను ఆరాధించే

చీకటి తొలగించి
కాంతిని వెదజల్లెన్
దు:ఖము, బాధలకు
నవభావము నిచ్చెన్

ప్రభువా మా దేవా
మీ తిరునామమును
ధ్యానించు అందరికి
శాంతి ప్రసాదించుము

# మంగళ వారము

## కీర్తన 57 : 1 – 3, 9 – 10

ప్రభువా నన్ను కరుణింపుము, నన్ను కరుణింపుము
నేను నిన్ను ఆశ్రయించితిని

అపాయములెల్ల తొలగిపోవు వరకు
నేను నీ రెక్కల నీడలో శరణు వేడెదను

మహోన్నతుడైన దేవునికి
నా కార్యము సఫలము చేయు దేవునికి
నేను మొర పెట్టుచున్నాను
ఆయన ఆకాశము నుండి నా ప్రార్థన ఆలకించి నన్ను కాపాడును

దేవా నా హృదయము సిద్ధముగా నున్నది
నేను నీపై పాటలు పాడి నిన్ను స్తుతించెదను

ప్రభువా, వివిధ జనుల మధ్య నీకు కృతజ్ఞతా సోత్రములను చెల్లించెదను
ప్రజలలో నిన్ను కీర్తించెదను

ప్రభువా నీ ప్రేమ ఆకాశమంత ఉన్నతమైనది
మీ విశ్వసనీయత మేఘమండల మంత ఎత్తైనది

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

# ప్రభాత గీతం

దేవుని ప్రియ సుతుడు – సిలువ మరణముచే
నరులకు దయచేసే – శాంతి విమోచనము

శాశ్వత స్వాతంత్ర్యం – పాప విమోచనము
ఇచ్చే ఆ సిలువన్ – ఆరాధించెదము

మరణపు ఆ సిలువే – నరులకు దయచేసే
శాశ్వత జీవమును – నిత్యానందమును

# బుధవారము

## కీర్తన 34 : 1 – 8

నేను ప్రభువునకు ఎల్లవేళల వందనములర్పింతును
నిరంతరము అతనిని కీర్తింతును

ప్రభువు నాకు చేసిన మేలులకుగాను సంతసింతును
ఈ సంగతిని విని దీనులు సంతోషం చెందుదురు గాక!

మీరును నాతో కూడి ప్రభువును ఘనపరచుడి
మనము అందరము కలిసి ఆయన దివ్య నామమును కీర్తింతుము

నేను ప్రభువును ఆశ్రయింపగా ఆయన నాకు ఉత్తరమిచ్చెను
నా భయములెల్ల తొలగించెను

దీనులు మొరపెట్టగా ప్రభువు ఆలకించెను
సకల దు:ఖముల నుండి ఆయన రక్షించెను

ప్రభువు నందు భయభక్తులు గల వారి చుట్టు
ఆయన దూత కావలి యుండి వారిని రక్షించును
దేవుడు ఎంతో ఉత్తముడని చవిచూచి తెలుసుకొనుడు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యము వరకును ఆమెన్

## ప్రభాత గీతం

సూర్యుడు అస్తమించినానంతరం – చీకటి భూమిని ఆవరించి
ప్రభూ ఆ చిమ్మ చీకటిని – తొలగించువారు ఎవరయ్యా

పరిపావనమైన మీ స్లీవా – మార్గము కోరే మానవులు
తొలగిపోయిన ఆ కాంతిని – నిక్షేపముగ వెలిగింతురు

మరణమును తన మరణముతో – జయించి పునరుత్థానమును
మా అందరికి దయ చేసిన – క్రీస్తువా మీకే స్తుతి మహిమ

# గురువారము

## కీర్తన 34 : 8 - 14

ప్రభువు ఎంతో ఉత్తముడని అనుభవ పూర్వకముగా తెలుసుకొనుడు
ఆయనను ఆశ్రయించు నరుడు ధన్యుడు

మీరు ప్రభువునకు భయపడుడు
ఆయనకు భయపడువారికి ఏమియు కొదవలేదు

దేవుని బిడ్డలారా మీరు నా ఉపదేశమును ఆలింపుడు
నేను మీకు దైవ భక్తిని నేర్పింతును

మీరు ఆనంద పూర్ణమైన దీర్ఘాయువు కోరినచో
అసత్యములు దుర్భాషలాడరాదు

కీడు చేయుట మాని మేలు చేయుడు
శాంతి మార్గములో పయనింపుడు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

స్వర్గములో భూలోకములో
నివసించే సకల జీవరాసులు
మీ నామమునే నిరంతరము
ఆరాధించి పొగడెదరు

ప్రభువా మీ తిరునామమును
కీర్తించి పొగడు వారందరికి
మీ కృప దివ్య వరములతో
దర్శన భాగ్యం ఇవ్వుమయా!

ఎగిసి లేచే తరంగాలు
అణుగును మీ ఘన నామమున
మానవులు మీ సన్నిధిలో
భక్తితో అంజలి ఘటించెదరు

# శుక్రవారము

## కీర్తన 16 : 1 - 11

ప్రభు నన్ను కాపాడుము
నేను మిమ్ము శరణు వేడుచున్నాను

మీరే నాకు దేవుడు
మీ కంటే నాకు క్షేమాధారము లేదని
దేవునితో నేను మనవి చేసెదను

ప్రభువే నాకు వారస భూమి, నాకు పానపాత్రము
నా ప్రాణము అతని అధీనమున వున్నది

నాకు లభించిన వారస భూమి అతి శ్రేష్టమైనది
ప్రభువు నాకు హితోపదేశము చేయును
కనుక నేను అతనిని స్తుతించుచున్నాను

రాత్రులందు నా అంతరాత్మ నాకు బోధించుచున్నది
నేను ప్రభువును నిత్యము నా కన్నుల ఎదుట నిలుపుకొందును
అతడు నన్ను కాపాడును

అందువలన నా హృదయము సంతోషించుచున్నది
నా ఆత్మ హర్షించుచున్నది

నా శరీరం కూడా సురక్షితముగా ఉన్నది
మీరు నన్ను పాతాళములో వదిలివేయరు

నీ పరిశుద్ధుని కుళ్ళు పట్టనీయరు
జీవమార్గము మీరు నాకు తెలియచేసితిరి

మీ సన్నిధిలో సంపూర్ణ సంతోషము కలదు
మీ కుడిచేతిలో శాశ్వత ఆనందము కలదు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

నజరేయుడేసుని ఆనతి వినగానే
సమాధి తెరువబడి మృతులు లేచుదురు

సజ్జన దుర్జనుల బేధము లేకుండా
దేవుడు మృత్యువును - విధిగా పంపెదరు

మట్టితో నన్ను సృజించిన మా దేవా
నిన్ను స్తుతియించ దయచేయు ఉత్థానం

# శనివారము

## కీర్తన 113 : 1 - 9

మీరు ప్రభువును స్తుతింపుడు
సజ్జనుల సమాజములో పూర్ణ హృదయముతో
నేను ప్రభువునకు కృతజ్ఞతా స్తుతులర్పింతును

ప్రభువు కార్యములు మహత్తరమైనవి
అతని యందు ప్రీతి గలవారు అతనిని అర్థము చేసుకొందురు

తనయందు భయభక్తులు గల వారిని పోషించును
నిత్యము తన నిబంధనను జ్ఞాపకము చేసుకొనును

ఆయన కార్యములు న్యాయమైనవి, నమ్మకమైనవి
ఆయన శాసనములు శాశ్వతమైనవి

దైవభయము విజ్ఞానమునకు మొదటి మెట్టు
ఈ గుణములను అనుసరించువారు వివేకవంతులు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకున్ ఆమెన్

## ప్రభాత గీతం

దైవ కుమారుడు నరుడై జన్మించే
స్వర్గ కవాటమును నరులకు తెరుచుటకు

పాపపు బురదలో మునిగిన మనుజులను
స్వర్గపు తీరమున చేర్చును ప్రభు యేసు

దీనుల ప్రార్థనలు ఆలించిన ప్రభువా
దయచూపుము దేవా - అభయము ఒసగుమయా

# సభా సమర్పణ కాలము

# ఆదివారము

## కీర్తన 42 : 1 – 6

ప్రభువా దప్పిక గొనిన దుప్పివలె సెలయేటి నీటి కొరకు
నా హృదయం నీ కొరకు తపించుచున్నది

సజీవ దేవుడైన మీ కొరకు నేను ఆరాటపడుచున్నాను
మీ సన్నిధికి నేనెప్పుడు వచ్చెదను

మీ దేవుడు ఏడి అని శత్రువులు నాతో అనుచుండగా
దిన రాత్రములు నా కన్నీళ్ళే నాకు అన్న పానీయములాయెను

నేను ఇప్పుడింతగా విచారము చెందనేల
ఇంతగా నిట్టూర్పులు విడువనేల

నేను ప్రభువును నమ్మెదను
ప్రభువా, నేను విచారముతో మునిగి యున్నాను
కనుక నేను మిమ్ము స్మరింతును

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

సారవంతమైన భువిలోన – శత్రువు జల్లిన కలుపులను
కాల్చివేయ అరుదెంచే – దైవ కుమారా వందనము

దయతో దేవా పైరులను – పోషణమిచ్చి పెంచండి
ఆరని అగ్నిలో కలుపులను – కాల్చి భస్మము చేయండి

మీ పునరాగమ దినం వరకు – పేతురు చేత కట్టబడిన
శ్రీ సభను మీరెల్లప్పుడు – కాపాడండి దయతోడన్

# సోమవారము

## కీర్తన 63 : 1 - 9

దేవా నీవు నాకు దేవుడవు
నీళ్ళు లేక ఎండిన నేల వలె
నా యాత్మ మీ కొరకు దప్పికగొనుచున్నది

మీ శక్తిని తేజస్సును కన్నులారా చూడవలెనని నా కోరిక
మీ ప్రేమ ప్రాణము కంటే శ్రేష్ఠమైనది

నా జీవిత కాలమంతా మిమ్ము స్తుతించెదను
మీకు కరములెత్తి ప్రార్థన చేసెదను

మీ సాన్నిధ్యమున విందును ఆరగించి
నా ఆత్మ సంతృప్తి చెందును

నా మంచము మీద మిమ్ము స్మరించుకొందును
రేయి నాలుగు పర్యాయములు మిమ్ము ధ్యానింతును

నా ప్రాణము మిమ్ము అంటి వెంబడించుచున్నది
మీ కుడి చేయి నన్ను ఆనుకొని వున్నది

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

స్నేహమనే నూతన ఆజ్ఞ
నరులకు ఒసగెను ప్రభు యేసు
పావనమగు తన రుధిరముచే
తెలిపిరి నిజమైన స్నేహమును

ప్రేమ విరాజిల్లే హృదయముతో
ధృడ విశ్వాసపు దీపముతో
నిరతము మహిమను చవిచూడ
మాకు వరమిమ్ము ప్రభువా

# మంగళవారము

## కీర్తన 46 : 1 – 3, 11

దేవుడు మనకు ఆశ్రయమును మార్గమునై ఉన్నాడు
ఆపదలో ఆయన నమ్మదగిన సహాయకుడు

భూమి కంపించినను, పర్వతములు సాగర గర్భమున కూలినను
మనము భయపడనక్కరలేదు

సైన్యమునకు అధిపతియగు ప్రభువు మనకు తోడై ఉన్నాడు
యాకోబు దేవుడు మనకు ఆశ్రయమై ఉన్నాడు

రండు, ప్రభువు కృత్యములను దర్శింపుడు
భూమి మీద ఆయన సల్పిన మహాకార్యములను వీక్షింపుడు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

యూదా ప్రజలైగుప్తు నుండి
ఆనందముగా పయనించిరి
నిరతము వారికి దుర్గమువై
వెలుగు, నీడలో నడిపితివి

భువియందలి మీ శ్రీసభకు
పరిపోషణమును దయచేయు
మాలిన్యములు తొలగించి
నిర్మల మార్గంలో నడిపించు

# బుధవారము

## కీర్తన 34 : 15 - 21

ప్రభు దృష్టి నీతిమంతుల మీద ఉన్నది
ఆయన వీనులు వారి మొర ఆలించెను

ప్రభువు దుష్కార్యములు చేయు వారిని ఎదురించును
నీతిమంతులు మొరపెట్టినచో ప్రభువు ఆలించును

వారి శ్రమలన్నిటిలో నుండి వారిని విడిపించును
విరిగిన హృదయం గలవారిని
నలిగిన మనస్సు గల వారిని ఆయన రక్షించును

నీతిమంతునికి కలుగు ఆపదలు అనేకములు
వాటి అన్నిటిలో నుండి ప్రభువు అతడిని రక్షించును

చెడ్డతనము భక్తిహీనులను సంహరించును
నీతిమంతులను ద్వేషించువారు దండనమును బడయుదురు

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

బాధిత నరులకు అభయం దయచేయ
సభను స్థాపించే కరుణామయుడేసు

సభను రక్షింప మరణించిన ప్రభువా
మానవులందురు నిన్ను కీర్తింతురు

# గురువారము

## కీర్తన 95 : 1 - 7

రండు ప్రభువును సంతోషముతో స్తుతింతుము
మన రక్షణ దుర్గమైన దేవుని ఆనందముతో కీర్తింతుము

ప్రభువు మహా దేవుడు
దైవములందరికి మహారాజు

భూగర్భము నుండి పర్వత శిఖరము వరకు
సమస్తమును ఆయనే పరిపాలించును

భూసాగరములు ఆయనే కలుగచేసెను
శిరము వంచి ఆయనను ఆరాధింతుము

ఆయన మన దేవుడు, మనము ఆయన పాలించు ప్రజలము
ఆయన మేపు గొఱ్ఱెలము
రండి నమస్కారములు చేసి ప్రణమిల్లుదము

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

నిరంతరం పొగడబడు – మా దివ్య రక్షకుడా
సతతము మీకే చెల్లున్ – పూజా అర్పణలు

మీ రక్షణ మార్గం – కనుగొనినవారు
మీ దివ్యమార్గములో – సతతము నడిచెదరు

మీరు స్థాపించిన – తిరుసభ విజయించును
సౌభాగ్యము నిచ్చున్ – నమ్మిన అందరికి

# శుక్రవారము

## కీర్తన 30 : 1 – 8

ప్రభువా నీవు నన్ను విపత్తు నుండి సంరక్షించితివి
శత్రువులు నా పతనమును చూసి సంతసింపకుండునట్లు చేసితివి
కనుక నిన్ను నేను స్తుతింతును

నా దేవుడవైన ప్రభువా నేను నీకు మొరపెట్టగా
నన్ను నీవు స్వస్థపరచితివి
మరణము నుండి నన్ను రక్షించితివి

ప్రభువు భక్తులారా ఆయనను స్తుతించి కీర్తింపుడు
పవిత్రుడైన ప్రభువును స్మరించుకొని వందనములర్పింపుడు

ఆయన కోపము నిమిషం మాత్రముండును
కాని ఆయన కరుణ చిరకాలం ఉండును

సాయంకాలపు దు:ఖము వలన కన్నీళ్ళు కార్చినను
ఉదయము మరల ఆనందము కలుగును

నా క్షేమకాలమున నాకు కీడు వాటిల్లదని నేను తలంచితిని
నీవు నన్ను కరుణతో పర్వత దుర్గమువలె కాపాడితివి

కాని నీవు నీ ముఖము నా నుండి దాచుకొనగానే
దేవా కలత చెందితిని

ప్రభు నీవు నా మొరను ఆలించి నా మీద దయ చూపుము
దేవా నన్ను ఆదుకొనుము

పితా పుత్ర పవిత్రాత్మకు స్తుతి
ఆది అంత్యములు వరకును ఆమెన్

# ప్రభాత గీతం

విజయముగానెప్పుడు విరాజిల్లు శ్రీసభను
తండ్రికి ప్రియసుతుడు ప్రేమతో అర్పించే

మీ సన్నిధి చేరే సకల మానవుల
దు:ఖదురితములన్ సిలువలో తీర్చితిరి

మహిమాన్వితమైన మీ తిరుసభకు
నిరతము విజయమును దయచేయుము దేవా!

# శనివారము

## కీర్తన 77 : 11 - 20

నీ కార్యమంతయు నేను ధ్యానించుకొందును
నీ క్రియలన్నియు నేను ధ్యానించుకొందును

దేవా నీ క్రియలు పవిత్రమైనవి
నీ వలె ఘనుడైన దేవుడెవరు?

మీరు అద్భుత కార్యములు చేసితిరి
నిఖిల జాతులలో మీ శక్తిని ప్రత్యక్షపరచితిరి

మీ బాహుబలం వలన యాకోబు యోసేపుల సంతతివారైన
మీ ప్రజలను మీరు విమోచించితిరి

దేవా మిమ్ము చూసి జలములు భయపడెను
సముద్రపు అగాధము కంపించెను

మేఘరాసులు నీళ్ళు దిమ్మరించెను
ఆకాశము గర్జించెను

మోషే అహరోనుల ద్వారా నీ ప్రజలను
నీవు మందవలె నడిపించితివి

పితా పుత్ర పవిత్రాత్మలకు స్తుతి
ఆది అంత్యముల వరకును ఆమెన్

## ప్రభాత గీతం

సిలువ దారిలో సజ్జనులు – అనుసరించిరి మిమ్ము వినయముతో
క్షణ భంగురమైన ఈ భువిలో – జీవించిరి పరదేశులుగా

ప్రభువా మీ తిరు సన్నిధిలో – మా మనస్సులను అర్పింతుం
శాంతి సమాధాన వరములతో – మము నింపండి ఎల్లప్పుడు

అబ్రహాము చూపిన మార్గములో – మా మనస్సులను అర్పింతుం
వినయన్వితమగు హృదయముతో – మీ వర సుమములు కురిపించు